క్లుప్తంగా

సొంత భవనాలు నిర్మించాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: ప్రభుత్వ ఉర్దూ మీడియం పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించాలని అల్‌ఫైజ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు జహంగీర్‌బాబా కోరారు. జిల్లా కేంద్రంలో సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉర్దూ మీడియం పాఠశాలలకు అన్ని వసతులు కల్పించాలన్నారు. పేద విద్యార్థుల కోసం సీఎం కేసీఆర్ మైనార్టీ గురుకులాలు ప్రారంభించడం చారిత్రాత్మక నిర్ణయమన్నారు. అదేవిధంగా ఉర్దూను అధికార భాషగా అమలు చేయాలని కోరారు. సమావేశంలో సొసైటీ కార్యదర్శి మహ్మద్ యాఖుబ్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాకర్లు పట్టివేత

జడ్చర్ల: మండల పరిధిలోని దుందుబీ వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను శుక్రవారం జడ్చర్లలో పట్టుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్లు రమేశ్, శేఖర్‌లపై కేసులు నమోదు చేసినట్లు వివరించారు.

చిన్నచింతకుంట: మండలంలోని మద్దూర్ గ్రామానికి చెందిన బోయ చిన్న అంజన్న శుక్రవారం ఉదయం గ్రామ సమీపంలోని ఊక చెట్టువాగునుంచి ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తుండగా అదే సమయంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు గమనించి ట్రాక్టరును పట్టుకున్నారు. ఈ మేరకు పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మోహన్‌బాబు తెలిపాడు.

ఆర్థికసాయం అందజేత

మిడ్జిల్: మండల పరిధిలోని వాడ్యాల్ గ్రామానికి చెందిన చిన్నయ్య అనారోగ్యంతో మృతి చెందగా, విషయం తెలుసుకున్న స్థానిక కాంగ్రెస్ నాయకులు విజయ్‌కుమార్ శుక్రవారం బాధితకుటుంబాన్ని పరామర్శించారు. రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు. మాజీ సర్పంచ్ వెంకటేష్ గౌడ్, మల్లయ్య, తిరుపతయ్య, రమేష్ తదితరులు ఉన్నారు.

డయాలసిస్ సేవలు ప్రారంభం

జడ్చర్లటౌన్: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ ఆస్పత్రిలో విర్కో ఫౌండేషన్ ఆధ్వర్యంలో డయాలసిస్ కేంద్రంలో ఉచితంగా సేవలు శుక్రవారం ప్రారంభం అయ్యాయి. మహవీర్ ఆస్పత్రి వారి సాంకేతిక పర్యావేక్షణలో సేవలు అందించనున్నారు.

పంటల సాగుపై అవగాహన

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం పంటల సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏరువాక కేంద్రం సమన్వయకర్త సీహెచ్ భరత్‌భూషన్‌రావు, శాస్త్రవేత్త అర్చనరైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మండల వ్యవసాయాధికారి రాజేందర్‌రెడ్డి, ఏఈఓ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

'భగీరథ' కార్మికులకు న్యాయం చేయాలి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: మిషన్ భగీరథ పథకంలో పనిచేస్తున్న కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మిషన్ భగీరథ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. రాష్ట్ర కార్యదర్శి నర్సింహ, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి సూర్య మాట్లాడారు. కార్మికులు శ్రమదోపిడీకి గురవుతున్నారని ఆరోపించారు. గతంలో ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సమ్మె చేస్తామని హెచ్చరించారు. రామ్మోహన్, సురేష్, వెంకటేష్, రాము, మహేశ్, ప్రకాశ్ తదితరులు పాలొన్నారు.

లారీని ఢీకొట్టిన బైక్

జడ్చర్ల: లారీని వెనుక నుంచి ఓ మోటార్ బైక్ ఢీకొట్టిన ఘటన మండలపరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ లెనిన్ కథనం మేరకు...జడ్చర్ల వద్ద శుక్రవారం 44వ నంబర్ జాతీయరహదారిపై లారీని ఇండికేటర్స్ వేసి మలుపుతున్న సమయంలో సవారన్న అనే వ్యక్తి తన మోటార్ బైక్‌తో వెనుక నుంచి ఢీ కొట్టాడు. దీంతో అతడితో పాటు బైక్‌పై ఉన్న నాలుగేళ్ల బాలుడు అర్జున్ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించామని, ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు



దేవరకద్రలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

దేవరకద్ర: రాష్ట్రం వచ్చాక అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అందించడానికి ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాలలో భాగంగా శుక్రవారం దేవరకద్ర మార్కెట్ యార్డులో జరిగిన సంక్షేమ సంబరాలలో ఎమ్మెల్యే మాట్లాడారు. అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు 16,021 మందికి కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకం కింద రూ. 160 కోట్లు అందించామన్నారు. ఓవర్‌సిస్ స్కాలర్ షిప్ ద్వార 26 మందికి రూ.5.20 కోట్లు మంజూరయ్యాయని వివరించారు. బీసీ ఎస్సీ మైనార్టీ గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేసుకున్నామన్నారు. సెలూన్, లాండ్రీ, దోబీ ఘాట్‌లకు ఉచిత విద్యుత్ ఇస్తున్నామని వివరించారు. అదేవిధంగా కార్యక్రమంలో జెడ్పీ చైర్ పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలోనే తెలంగాణ సంక్షేమ పథకాలను అమలు చేయడంలో నెంబర్ వన్‌గా నిలిచిందని అన్నారు. ఈ సందర్భంగా 104 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యేతో కలిసి అందజేశారు. 32 మందికి ఇళ్లపట్టాలు అందించారు. కుల వృత్తులకు చెందిన నలుగురికి రూ. 4 లక్షలు అందజేశారు. కులాంతర వివాహం చేసుకున్న రెండు జంటలకు రూ. 2.50 లక్షల చొప్పున, అదేవిధంగా మహిళలకు రూ. 2.79 కోట్ల రుణాల చెక్కులను పంపిణీ చేశారు. ఎంపీపీలు రమాదేవి, శేఖర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సుజాత, నాయకులు, అధికారులు ప్రసాద్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): పట్టణంలోని వెంకటేశ్వర కాలనీ 11 కేవీ ఫీడర్ మరమ్మతు వల్ల శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ భగవంతయ్య శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు లక్ష్మీనగర్‌కాలనీ, పద్మావతికాలనీ, వెంకటేశ్వర కాలనీల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు సరఫరా నిలిపివేస్తామన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

పంచాంగల్ తండాలో ప్రత్యేక పూజలు

గండేడ్: పంచాంగల్‌తండాలో ఆంజనేయ స్వామి ప్రతిష్ఠాపనోత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 9గంటలకు ద్వారపూజ, ప్రధానదేవత హోమాలు, మూలమంత్రం హోమాలు నిర్వహించారు. అనంతరం పంచసూక్త హోమం, క్షీరాధివాసం, ఫలపుష్ప సహిత శయ్యాదివాసం, మంగళహారతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తండాలోని భక్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. అనంతరం మాజీ ఎంపీటీసీ సరోజ ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. సర్పంచ్ రాజు నాయక్, బీఎంఆర్ ట్రస్టు చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెంట్యానాయక్, బీజేపీ అధ్యక్షుడు ప్రభునాయక్ తదితరులు పాల్గొన్నారు.

కుల వృత్తిదారులకు చేయూత



గొర్రెలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తదితరులు

జడ్చర్ల: రాష్ట్ర ప్రభుత్వం కుల వృత్తులకు చేయూత నందిస్తోందని ఎమ్మెల్యే సి.లక్ష్మారెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానికంగా వివిధ శాఖల ఆధ్వర్యంలో సంక్షేమ సంబురాలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై ప్రజల నుద్దేశించి ప్రసంగించారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలన్న సంకల్పంతో సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. అందులో భాగంగానే గొర్రెల పంపిణీ చేపట్టారని అన్నారు. మొదటి విడతగా నియోజకవర్గంలో రూ.50 కోట్ల వ్యయంతో 4037 మందికి 84,777 యూనిట్లు పంపిణీ చేసినట్లు వివరించారు. రెండో విడతలో రూ.72 కోట్ల వ్యయంతో 4,119 మందికి 86,499 యూనిట్లు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. అదే విధంగా కులవృత్తులను ప్రోత్సహించడం కోసం ఇటీవలే రూ.లక్ష ఆర్థికసాయం ప్రకటించి అమలు చేయడానికి చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. అనంతరం రాజాపూర్, బాలానగర్ మండలాల లబ్ధిదారులకు 24 యూనిట్ల గొర్రెలను పంపిణీ చేశారు.కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య, జెడ్పీ సీఈఓ జ్యోతి, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి, మిడ్జిల్ ఎంపీపీ సుదర్శన్, మార్కెట్ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన ఆహారం తీసుకోవాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఆరోగ్యవంతమైన ఆహారాన్ని ప్రతిఒక్కరు తీసుకోవాలని రాష్ట్ర మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శిల్పారామంలో నిర్వహిస్తున్న ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ స్టాళ్లను జిల్లా కలెక్టర్ రవి నాయక్‌తో కలిసి మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా చేపల్లో రారాజుగా పేరు ఉన్న కొర్రమట్టను మంత్రి పరిశీలించారు. చేపలు ఆరోగ్యానికి మేలు చేస్తాయని అన్నారు. కొలెస్ట్రాల్ తక్కువ ఉండడంతో పాటు తేలికగా జీర్ణం అవుతుందని పేర్కొన్నారు. ఫుడ్ స్టాల్స్ బాగున్నాయని అధికారులను అభినందించారు. ఈ ముడా చైర్మన్ వెంకన్న, మున్సిపల్ చైర్మన్ నర్సిములు, వైస్‌చైర్మన్ గణేష్ తదతరులు పాల్గొన్నారు.



చేపలను పరిశీలిస్తున్న మంత్రి శ్రీనివాస్ గౌడ్, కలెక్టర్ రవినాయక్

రక్త సేకరణ వాహనం ప్రారంభం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లాలో రెడ్‌క్రాస్ సేవలను విస్తృతం చేయాలని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ ఆవరణలో రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో తయారు చేసిన మొబైల్ రక్త సేకరణ వాహనాన్ని కలెక్టర్ రవి నాయక్‌తో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. రక్తం దానం చేయడం వల్ల మనిషి ఆరోగ్యంగా ఉంటాడన్నారు. నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నరేందర్, కార్యదర్శి రామకృష్ణ మరికొందరు రక్తదానం చేశారు. అడిషనల్ కలెక్టర్ సీతారామారావు, ఎస్పీ నరసింహ, రెడ్‌క్రాస్ చైర్మన్ నటరాజు, వైస్ చైర్మన్ శ్యామ్యుల్, కోశాధికారి జగపతిరావు, మేనేజర్ చంద్రశేఖర్, డీఎంహెచ్‌ఓ కృష్ణ, భాస్కర్, పాల్గొన్నారు.

ఇంటర్లాకింగ్ బ్రిక్స్ యూనిట్ ప్రారంభం



మహబూబ్‌నగర్ రూరల్: గ్రామీణ ప్రాంతాలలో యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు ఇంటర్లాకింగ్ బ్రిక్స్ యూనిట్లు ఎంచుకోవడం అభినందనీయమని ఎంపీపీ సుధాశ్రీ, జెడ్పీటీసీ సభ్యురాలు పుల్లారి వెంకటేశ్వరమ్మ అన్నారు. మండల పరిధిలోని అల్లీపూర్ గ్రామ సమీపంలో నూతనంగా నిర్మించిన ఇంటర్లాకింగ్ బ్రిక్స్ యూనిట్‌ను శుక్రవారం వారు ప్రారంభించారు. ఈ ఇటుకలు తయారు చేయడంతో అడ్డగోలు ఇసుక తవ్వకాలను కూడా నియంత్రించవచ్చని అన్నారు. ధర కూడా తక్కువే ఉండడంతో ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బి.రాజేశ్వర్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సిములు, ముడా డైరెక్టర్ కాడం ఆంజనేయులు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

మహబూబ్‌నగర్ రూరల్: స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటి దాకా ఏ ప్రభుత్వం ఆరెకటికల గురించి పట్టించుకున్న పాపాన పోలేదని బీసీ మేధావుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.ప్రభాకర్ అన్నారు. ఆరెకటికలు ఎంతోమంది ఆర్థికంగా లేకపోవడం వల్ల ఇబ్బంది పడుతున్న సమయంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో బీసీ కులాల అభివృద్ధి కోసం రూ. లక్ష రూపాయల ఆర్థికసాయం ఇవ్వడానికి నిర్ణయించడం స్వాగతిస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా వన్‌టౌన్ చౌరస్తాలోని మాంసం మార్కెట్‌లో సీఎం కేసీఆర్, మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ల చిత్రపటానికి ఆరెకటికలు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో రాజు, మహేష్, నర్సింగ్, శ్రీనివాసులు, మల్లేష్, మహేందర్, ధీరజ్, శంకర్, రమేష్ పాల్గొన్నారు.



చలో పాలమూరు కరపత్రాల విడుదల



బాలానగర్: జిల్లా కేంద్రానికి ఈ నెల 12న ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ రానున్నట్లు నాయకుడు కొండకళ్ల విష్ణువర్ధన్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలో చలో పాలమూర్ కరపత్రాలను విడుదల చేశారు. ఎస్సీ వర్గీకరణ కోసం పార్లమెంట్‌లో ఈ సమావేశాల్లోనే బిల్లు పెట్టి చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఎంఎస్పీ, ఎంఆర్‌పీఎస్ నాయకులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. శ్రీకాంత్, సురేష్, బాలు, నవీన్ పాల్గొన్నారు.

జడ్చర్ల టౌన్: జిల్లా కేంద్రానికి ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఈ నెల 12న రానున్నట్లు ఎంఎస్పీ ఉమ్మడి జిల్లా కన్వీనర్ జంగయ్య మాదిగ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో చలోపాలమూర్ న కరపత్రాలను ఆవిష్కరించారు. నాయకులు కరాటే శ్రీను, వినోద్ మాదిగ, సురేష్ మాదిగలు పాల్గొన్నారు.

జోరుగా కలప అక్రమ రవాణా



బాలానగర్‌లో ట్రాక్టర్‌లో తరలుతున్న అక్రమ కలప(ఫైల్)

బాలానగర్: రాష్ట్ర ప్రభుత్వం రూ. కోట్లు ఖర్చుపెట్టి ఎంతో ప్రతిష్ఠాత్మకంగా హరితహారం చేపట్టి పచ్చదనం పెంచడానికి కృషిచేస్తోంటే... మరోవైపు అక్రమార్కులు ఇష్టానుసారంగా చెట్లు కొట్టి కలపను తరలిస్తూ జేబులు నింపుకొంటున్నారని హరిత ప్రేమికులు ఆరోపిస్తున్నారు. వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తూ కొందరు అధికారుల అండదండలతో అక్రమ కలప వ్యాపారం మూడు పూవులు–ఆరు కాయలు అన్నట్లుగా నిర్వహిస్తున్నారని అంటున్నారు. పట్టపగలే యథేచ్ఛగా ట్రాక్టర్లలో అక్రమంగా కలపను తరలిస్తున్న ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు వ్యాపారులు, పరిశ్రమలతో ఆయా అధికారులతో కుమ్మక్కై ఇంలాటి చర్యలు పాల్పడుతున్నారని, ఎలాంటి అనుమతి లేకుండానే భారీ వృక్షాలను, చెట్లను నరికి కలపను పరిశ్రమలకు, ఇటుకబట్టీలకు తరలిస్తున్నారని అంటున్నారు. నిత్యం అక్రమ రవాణ జరుగుతున్నా..అటవీశాఖ అధికారులు మాత్రం తమకు ఎలాంటి సమాచారం లేదని దాటవేస్తున్నారని ఆరోపిస్తున్నారు. మండల కేంద్రం నుంచి జాతీయరహదారిపై ట్రాక్టర్లలో కలప అక్రమ రవాణా సాగుతున్నా.. సీసీ కెమెరాల్లో రికార్డు అవుతున్నా మేము చూడలేదు, మాకేం తెలియదు అంటున్నట్లు వ్యవహిరిస్తున్నారని అంటున్నారు.

చర్యలు తీసుకుంటాం

కలప అక్రమంగా తరలించడం నేరం. ఎవరైనా ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠినచర్యలు తప్పవు. కలప అక్రమ రవాణాపై సమాచారం అందిస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటాం. అటవీశాఖ అధికారుల భయంతోనే అక్రమ వ్యాపారాలు చాలా వరకు తగ్గాయి. ఇప్పటికే మండలంలో పలు కేసులు నమోదు చేశాం. చెట్లను రక్షించుకోవడం అందరి బాధ్యత అని ప్రతిఒక్కరూ గుర్తించాలి.

– నరేందర్, ఎఫ్ఎస్ఓ, బాలానగర్

కట్టడి చేయాలి



హరితహారం కార్యక్రమంలో నాటిన మొక్కలను, చెట్లను సంరక్షించుకోవడంతోపాటు మన పూర్వీకులు నాటిన మొక్కలను కాపాడుకున్నప్పుడే భవిష్యత్తు తరాలకు మంచి ఆరోగ్యమైన వాతావరణం అందుబాటులో ఉంటుంది. ఎలాంటి అనుమతి లేకుండా చెట్లను నరికి సొమ్ముచేసుకుంటున్న వ్యక్తులను వారికి అండగా నిలుస్తున్నవారిపై కఠినచర్యలు తీసుకోవాలి.

– తెప్ప మణి, ఉపసర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు

అధికారులు స్పందించాలి



మండలంలో కొందరు అక్రమార్జనకు అలవాటు పడి చెట్లను నరికి కలపను అక్రమంగా తరలిస్తున్నారు. పర్యావరణాన్ని దెబ్బతీస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి. ఇలాంటి పునరావృతం కాకుండా చూడాలి.

– ప్రదీప్ గౌడ్, ఎంపీటీసీ, ఉదిత్యాల

కూచూర్‌లో ఉచిత వైద్యశిబిరం

నవాబుపేట: కూచూర్ గ్రామంలో ఎస్‌వీఎస్ ఆస్పత్రి ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో 349 మందికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించినట్లు సర్పంచ్ లక్ష్మమ్మ, ఎంపీటీసీ విజయశ్రీ తెలిపారు. బోజయ్య, పిట్టల రవి, సంజీవరెడ్డి, యాదీష్, సత్యనారాయణ, సుల్తాన్, లాలయ్య, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.



పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ఘనంగా బొడ్రాయి పండుగ



వేడుకల్లో పాల్గొన్న భక్తులు

రాజాపూర్: మండల పరిధిలోని రంగారెడ్డిగూడలో శుక్రవారం బొడ్రాయి ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మొదటిరోజు హోమాలు చేపట్టారు. సర్పంచ్ జనంపల్లి శశికళ రెడ్డి పాల్గొని మాట్లాడారు. దైవచింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాములుగౌడ్, భక్తులు లక్ష్మీనారాయణగౌడ్, కుమార్‌రెడ్డి, రవికుమార్‌గుప్తా, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధికి ఉచిత శిక్షణ

నవాబుపేట: స్వయం ఉపాధిలో ఉచిత శిక్షణ పొందాలనుకున్న నిరుద్యోగులకు ప్రథమ్ ఎడ్యుకేషన్ సంస్థ ద్వారా ఉచిత శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు శివకుమార్ తెలిపారు. 18 నుంచి 30 సంవత్సరాల లోపు వయసున్న యువతి యువకులు అర్హులన్నారు. శిక్షణ కార్యక్రమంలో ఉచితంగా భోజన వసతితో పాటు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వివరించారు. కాగా ఈ శిక్షణ పొందాలనుకునే వారు తమ పదో తరగతి మెమోతో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కాగా కార్యక్రమంలో బ్యూటీషియన్, హోటల్ మేనేజ్‌మెంట్, ఆటోమోటివ్ మేనేజ్‌మెంట్ తదితర అంశాల్లో 3 నెలలపాటు శిక్షణ ఉంటుందన్నారు.

ఘనంగా బోనాలు

నవాబుపేట: చౌడూర్‌లో శుక్రవారం మైసమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటేష్, ఎంపీటీసీ గోపీకృష్ణ, అమరేష్, రఘు, తిరుపతయ్య, వెంకటేష్, నారంజీ, సిద్దు తదితరులు పాల్గొన్నారు.

హామీలకే పరిమితం

భూత్పూర్: సీఎం కేసీఆర్ పథకాలు హామీలకే పరిమితమైనాయని వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు మందడి సరోజ్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కొత్తమొల్గరలో గడప గడపకు వైఎస్సార్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటా తిరిగి వైఎస్సార్ చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. జిల్లా ఉపాధ్యక్షుడు మొల్గర జహంగీర్, కార్యదర్శి చిల్లా రఘురెడ్డి ఉన్నారు.

అక్రమ కేసులు ఎత్తివేయాలి



నిరసన తెలుపుతున్న ఏబీవీపీ నాయకులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కేటీఆర్ కాన్వాయ్‌కి ఎదురెళ్లిన ఏబీవీపీ నాయకులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలోని న్యూటౌన్‌లో శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ కళాశాలల్లో వసతులు కల్పించాలని, ఫీజుల నియంత్రణ చట్టం చేయాలని నిరసన తెలిపితే కేసులు పెట్టడం దారుణం అన్నారు. విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం ఆడుకుంటోందని, కేసులు ఎత్తివేయాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి మహేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అశోక్, శేఖర్, శివ, అమర్, పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు సంబరాలు నిర్వహించే అర్హత లేదు

నారాయణపేట రూరల్: ప్రజల ఆకాంక్షలు నెరవేర్చకుండా ప్రభుత్వం సంబరాలు నిర్వహించే అర్హత లేదని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా నాయకులు యాదగిరి విమర్శించారు. గురువారం దీక్ష దివాస్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కోటకొండలో పర్యటించి కరపత్రాలు పంచి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పార్టీకి బలం పెంచుకోవడం కోసం అధికారిక సభల పేరుతో ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారని దుయ్యబట్టారు. మిగులు రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని, ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులు పూర్తిగా వ్యతిరేకంగా మారారని అన్నారు. కార్యక్రమంలో నర్సింహులు, ఇస్మాయిల్, రాఘవేందర్, రమేష్, భీంషప్ప దస్తప్ప పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యాదగిరి

హామీలు నెరవేర్చాలని ధర్నా



ధర్నాలో పాల్గొన్న నాయకులు

దేవరకద్ర: ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ సీపీఐఎంఎల్ ఆధ్వర్యంలో ప్రజాకాంక్ష దీక్ష దివస్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కౌకుంట్ల మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుటధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు సీహెచ్ రాంచందర్ మాట్లాడారు. సీఎం హామీలను విస్మరించి పదేళ్ల సంబరాలు నిర్వహిస్తున్నారని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీలు భర్తీచేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. తొమ్మిదేళ్లుగా రేషన్ కార్డులు జారీచేయలేదన్నారు. వెంటనే అర్హులందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలని, పేదలందరికీ డబుల్ బెడ్ రూమ్‌లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ఇఫ్టూ జిల్లా కార్యదర్శి సాంబశివుడు, శివారెడ్డి, బాలు, కొండారెడ్డి, కురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ బడులు



చిన్నాయపల్లిలో బడిబాట కార్యక్రమం

మహమ్మదాబాద్: బడిఈడు పిల్లందరినీ ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని సమగ్రశిక్ష పథక సీఎంఓ బాలు యాదవ్ తెలిపారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని చిన్నాయిపల్లి, శేక్‌పల్లి గ్రామాల్లో పర్యటించారు. ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వబడుల్లో వసతులు, బోధన తదితరాలు ఉంటున్నాయని అన్నారు. పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్‌సీ శ్రీకాంత్, సీఆర్పీ వెంకట్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బాలానగర్: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి విద్యార్థుల తల్లితండ్రులకు అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు శ్రీధర్, యాదమ్మ, చెన్నయ్య, నారాయణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఒకరిపై కేసు నమోదు

అడ్డాకుల: మూసాపేట మండలంలోని పోల్కంపల్లి గ్రామానికి చెందిన తిరుపతయ్యను కొట్టిన ఆంజనేయులుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విజయభాస్కర్ తెలిపారు. ఖిల్లాఘనపురం మండలానికి చెందిన ఆంజనేయులు తన సోదరిని తిరుపతయ్యకు ఇచ్చి వివాహం చేసినట్లు పేర్కొన్నారు. ఇటీవల తిరుపతయ్య తన భార్యను మందలించగా శుక్రవారం ఆంజనేయులు పోల్కంపల్లికి వెళ్లి తన బావ తిరుపతయ్యపై చేయి చేసుకున్నాడని అన్నారు. ఘటనపై తిరుపతయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

ఘన సన్మానం

స్టేషన్ మహబూబ్‌నగర్: జీకే షోటోకాన్ సీనియర్ కరాటే మాస్టర్ శివకుమార్ ఆధ్వర్యంలో హజ్‌యాత్రకు వెళ్తుతున్న జర్నలిస్ట్ అలీమోద్దీన్‌ను శుక్రవారం ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథులుగా జీకే షోటోకాన్ ఫౌండర్, చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ జి.కృష్ణయ్య, సీనియర్ మాస్టర్ రవికుమార్ హాజరయ్యారు. విద్యార్థులకు అలీమోద్దీన్ చేతులమీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. సీనియర్ మాస్టర్ శివకుమార్, బాక్‌బెల్టు మాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.